
నిత్యావసరాల ధరలకు రెక్కలు



నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వంట నూనెలు కిలోకు రూ.30 నుంచి రూ.40కు పెరిగాయి. కందిపప్పు పరిస్థితీ అదే తీరుగా ఉంది. దీంతో మార్కెట్‌కు వెళ్లాలంటే వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ఒక్క నెలలో ఈ విధంగా వస్తువుల ధరలు గతంలో పెరిగిన దాఖలాలు లేవని విమర్శిస్తున్నారు.

- అమాంతం పెరిగిన వంట నూనెల ధరలు
- పేదలకు గుండె దడ

పామర్రు: రోజు రోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండడంతో పేద, మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారుతోంది. దసరా పండగ సందర్భంగా మండుతున్న నిత్యావసర వస్తువుల ధరలను చూసి మధ్య తరగతి ప్రజల గుండె దడ పెరిగిపోతుంది. ఓ వైపు కిరాణా వస్తువులు, మరో వైపు కూరగాయల ధరలు పెరిగిపోతుండడంతో పేదలు ఏమీ కొని తినలేని పరిస్థితి నెలకొంది. సన్‌ఫ్లవర్, పామాయిల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. అదేవిధంగా ఎండు కొబ్బరి, వెల్లుల్లి ధరలు దాదాపుగా రెట్టింపు కావడంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు.



వంట నూనెలు

వస్తువు పేరు (కిలో/లీటర్)	నెల క్రితం ధర	ప్రస్తుతం ధర
పామాయిల్ లీటర్	రూ .94	రూ.130
సోనామసూరి బియ్యం	రూ.60	రూ.70
సన్‌ఫ్లవర్ ఆయిల్	రూ .115	రూ.140
మైదా పిండి	రూ.40	రూ.45
చింత పండు	రూ.120	రూ.160
వెల్లుల్లి	రూ.200	రూ.400
శనగ గుళ్ల	రూ.150	రూ.180
కంది పప్పు	రూ.160	రూ.180
ఎండు కొబ్బరి	రూ.140	రూ.180
ఉప్మారవ్వ	రూ.40	రూ.45

15 లీటర్ల డబ్బా రూ.400 పెరిగింది

సన్ ఫ్లవర్ ఆయిల్ 15 లీటర్ల డబ్బా నెల క్రితం రూ.1,600 ఉండగా ప్రస్తుతం రూ.2,000కు పైగానే పలుకుతోంది. దీన్నిబట్టి చూస్తే ధరలు ఏవిధంగా పెరిగాయో అర్థమవుతోంది. నలుగురున్న కుటుంబాని గతంలో నిత్యావసర వస్తువులు, కూరగాయలకు నెలకు రూ.5,000 ఖర్చు అయ్యేది. ప్రస్తుతం రూ.9,000 నుంచి రూ.10,000 కావాల్సి వస్తుందని మధ్యతరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా పండగ వేళ ప్రజల కొనుగోళ్లతో కిటకిటలాడాల్సిన కిరాణా దుకాణాలు వెల వెల బోతున్నాయి. హోల్ సేల్‌తో పాటు రిటైల్ షాపుల నిర్వాహకులు సైతం వ్యాపారాలు సరిగా లేవని చెబుతున్నారు.



కందిపప్పు

నీటి మూటలుగా కూటమి నేతల హామీలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు, పంచదార, కందిపప్పు సరఫరా చేసేది. ప్రస్తుతం అవి పూర్తి స్థాయిలో సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే ధరలను నియంత్రిస్తామని హామీలిచ్చిన కూటమి నేతల హామీలు నీటిమూటలుగా మారాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని పేదలు కోరుతున్నారు.

ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో విఫలమయ్యాయి. మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. పెరిగిన ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు ఏమీకొనలేని పరిస్థితి. చాలా మంది పచ్చడి మెతుకులతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వాలు స్పందించి నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– గంగాధర ప్రసాద్, సీపీఎం పట్టణ కన్వీనర్, పామర్రు

సగానికి పైగా వ్యాపారాలు పడిపోయాయి



పండగ వేళ జోరుగా ఉండాల్సిన వ్యాపారాలు అంతంతమాత్రంగా ఉన్నాయి. పెరిగిన రేట్లతో చాలా మంది ప్రజలు కిలో తీసుకునే వస్తువులను అరకిలో మాత్రమే తీసుకుని సరిపెడుతున్నారు. గతంలో ఎప్పుడూ ఇంత అధ్వానంగా వ్యాపారం జరిగింది లేదు. రూ.లక్షలు పెట్టుబడిలు పెట్టి వస్తువులు తెప్పిస్తే వ్యాపారాలు లేని పరిస్థితి నెలకొంది. ఏమి చేయాలో పాలు పోవడం లేదు.

– కె.నాగరాజు, ప్రొకెర్ల, వ్యాపారి

ఏమీ కొనలేని పరిస్థితి



నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పెరిగిన ధరలతో మార్కెట్లో ఏమీ కొనలేని పరిస్థితి. మొన్నటి వరకు కూరగాయల ధరలతో ఇబ్బందులు పడితే ప్రస్తుతం కిరాణా సరుకుల ధరలతో ఏమి చేయాలో అర్థం కావడం లేదు. పండగ పూట ఏది కొందామన్నా ధరలను చూసి గుండె దడ వస్తోంది. ఇలాగైతే మాలాంటి మధ్య తరగతి ప్రజలు ఎలా జీవించాలి.

– పి.రత్నకుమారి, గృహిణి, నెమ్మలూరు

నూనె ధరలు దడ పుట్టిస్తున్నాయి



నూనె ధరలు విపరీతంగా పెరిగాయి. లీటరకు రూ.30 నుంచి రూ.40 వరకు పెరగడంతో మా వంటి మధ్యతరగతి ప్రజలందరూ ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ఇళ్లు గడవటం కష్టతరమవుతోంది. ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలి.

– పసుపులేటి సాహితి, మండవల్లి

సామాన్యులు ఏ విధంగా జీవించాలి



నిత్యావసర వస్తువులు ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కుటుంబాన్ని నెట్టుకురావడం కష్టతరమవుతోంది. ఇప్పటికే ఉల్లి, టమాటా ధరలు దడ పుట్టిస్తున్నాయి. ఇప్పుడు వంట నూనెలు ధరలు పెరిగిపోతుంటే సామాన్యులు ఏ విధంగా జీవించాలి. నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలి.

– జి.నారాయణమ్మ, ముదినేపల్లి

క్లుప్తంగా

దుర్గాష్టమికి భారీ ఏర్పాట్లు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే దుర్గాష్టమికి భారీ ఏర్పాట్లను చేపట్టారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు నిర్వహించే భారీ అన్నసమారాధనకు ఆదివారం పొక్లెయిన్‌తో పనులను చేపట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్, మోహనరావు, దేవేంద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆశీస్సులు అందరికీ దక్కాలి

కైకలూరు: దసరా మహోత్సవాలను ప్రజలందరూ ఘనంగా జరుపుకుని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. లోకుమూడి దత్తాశ్రమంలో గురజాడ ఉదయశంకర్ ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో ఆదివారం పాల్గొన్నారు. కోరుకొల్లులో నూతనంగా ప్రతిష్ఠించిన వరసిద్ధ వినాయక స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఇదే గ్రామంలో దసరా మహోత్సవాల్లో భాగంగా రాజారాజేశ్వరీ అమ్మవారిని దర్శించుకున్నారు. కైకలూరు రైల్వే స్టేషన్ రోడ్‌లో మన్నా చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, కూటమి నేతలు పూల రామచంద్రరావు, కొల్లి బాబీ, ప్రసాదరాజు, రాంబాబు, కోరుకొల్లు సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ పాల్గొన్నారు.

670 మందికి వైద్యపరీక్షలు

గుడ్లవల్లేరు: ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సీఎల్ వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో ఆదివారం ఉచిత కార్పొరేట్ వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 670మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ వెంకట్రావు, నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి టెక్నీషియన్లు కణితి శశిరేఖ, హనుమకొండ దుర్గా భవాని వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె, ఊపిరి తిత్తులు తదితర సంబంధ వ్యాధులకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగంశెట్టి వర్ధన్, సాధారణ వైద్యానికి హోమియో వైద్యురాలు పి.భవాని వైద్య సేవలను రోగులకు అందించారు.

డాక్టర్ వెంకట్రావుకు సన్మానం

సొంత గడ్డ కోసం 25ఏళ్లగా తన సొంత ఖర్చులతో జిల్లా వాసులకు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సీఎల్ వెంకట్రావు అందిస్తున్న కార్పొరేట్ వైద్య సేవలు ఆదర్శనీయమని కైకలూరు ఏఎంసీ మాజీ చైర్మన్ తలసరి వెంకటస్వామి అన్నారు. గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో ఆదివారం డాక్టర్ వెంకట్రావును వెంకటస్వామి, కొనాల జయరాజు, బలవరపు పాపయ్య సన్మానించారు.

ఉచిత వైద్యశిబిరం

గుడివాడ టౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో డాక్టర్ పెరుమాళ్లు కుమార్తె డాక్టర్ లలిత సహకారంతో పెద అవుటపల్లికి చెందిన పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రి వైద్యబృందంచే ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 150 మందికి పైబడి రోగులకు ఉచిత వైద్యపరీక్షలతో పాటు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యాంప్ కో–ఆర్డినేటర్ సీహెచ్.సూర్యచంద్రరావు, రోటరీక్లబ్ అధ్యక్షుడు టీఎస్.రాజశేఖర్ పాల్గొన్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

వేములమడ(మొవ్వ): మొవ్వ మండలం వేములమల గ్రామ శివారులోని బహిరంగ ప్రదేశంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారంటూ వచ్చిన సమాచారం మేరకు కోడి పందేలపై దాడి నిర్వహించి, ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు కూచిపూడి ఎస్‌ఐ ఎం.సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన దాడిలో జూదరులతో పాటు ఓ కోడిని, రూ.6,730ను స్వాధీనం చేసుకుని, వారి పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

భారీ అన్నసమారాధన



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం భారీ అన్నసమారాధన జరిగింది. గణపతి నవరాత్రి మహోత్సవాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా శాంతి నిమిత్తం అన్నసమారాధన నిర్వహించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. సుమారు 10 వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు వివరించారు.

ఘనంగా ప్రపంచ సెరిబ్రల్ పాల్సి దినోత్సవం

ఎలకుర్రు(పామర్రు): స్థానిక కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్టులో ఆదివారం ప్రపంచ సెరిబ్రల్ పాల్సి దినోత్సవాని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యులు వై.నరేష్ మాట్లాడుతూ మేనరికం పెళ్లిళ్ల వలన, ప్రీ మెచ్యూరిటీ డెలివరీలతో ఈ వైకల్యం వస్తుందన్నారు. చిన్నారుల్లో అంగవైకల్యం రావడానికి బిడ్డ తల్లి గర్భంలో ఉన్నప్పుడు తల్లికి ఉన్న ఇన్‌ఫెక్షన్ శిశువుకు సంక్రమించినప్పుడు వస్తుందన్నారు. అనంతరం దివ్యాంగ చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ట్రస్టు నిర్వాహకులు కాశీనాథుని నాగేశ్వరరావు, సిబ్బంది వసుంధర పాల్గొన్నారు.



గుడివాడ గౌరీశంకర స్వామి దేవస్థానంలో శ్రీ మహాగౌరీ దేవిగా అమ్మవారు



తటివర్రు రోడ్డులో శ్రీకాశీఅన్నపూర్ణాదేవిగా అమ్మవారు



భద్రిరాజుపాలెంలో శ్రీలలితా త్రిపురసుందరి దేవిగా ..



పామర్రులో సంతానలక్ష్మిగా పర్వత వర్ధనీదేవి



కాశీ అన్నపూర్ణా సుందరీ దేవిగా దర్శనమిచ్చిన కొండలమ్మ

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు

తోట్లవల్లూరు: దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. మండలంలోని భద్రిరాజుపాలెంలోని శ్రీరాజరాజేశ్వరి శ్రీరాజభద్రేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు ఆదివారం శ్రీలలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు ఉమామార్కండేయశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఆదివారం లలితా త్రిపురసుందరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గురజ శివాలయం, అల్లూరు సోమేశ్వరస్వామి, సింగరాయపాలెం అమృతేశ్వర స్వామి, పెయ్యేరు కనకదుర్గమ్మ, పెదకామనపూడి రామలింగేశ్వరస్వామి, ఊటుకూరు శివారు నారాయణపురం అంకమ్మ ఆలయంలో అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులను అనుగ్రహించారు.

తటివర్రురోడ్డులో..

గుడివాడరూరల్: తటివర్రురోడ్డులో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో అమ్మవారు శ్రీకాశీఅన్నపూర్ణాదేవిగా ఆదివారం దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష అలంకరణలు చేసి వేదపండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చిన ఎరుకపాడులోని శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు గాయిత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీ మహాగౌరీ దేవిగా అమ్మవారు

గుడివాడ టౌన్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం నాల్గో రోజు అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనానికి ఉంచారు. గౌరీశంకర స్వామి దేవస్థానంలో శ్రీ మహాగౌరీదేవిగా, నీలామహల్ రోడ్‌లోని శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో శ్రీ గాయత్రి దేవిగా, కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా, భీమేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ అన్నపూర్ణా దేవిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు.



కైకలూరు శ్యామలాంబ ఆలయంలో చండీ మహాయాగం

కాశీ అన్నపూర్ణాదేవిగా కొండలమ్మ

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి అమ్మవారు శ్రీ కాశీ అన్నపూర్ణా దేవిగా ఆదివారం దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో ఆలయ పండితుల వేద మంత్రోచ్చరణ నడుమ ప్రత్యేక హోమాలను చేపట్టారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పెన్నేరు రమేష్, మోహనరావు, దేవేంద్ర పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం అమ్మవారిని లలితా త్రిపురసుందరిగా అలంకరించి పూజలుచేశారు. విశేషంగా నిర్వహించిన కుంకుమ పూజలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొగ్గరపు జాలయ్య, సాయిబాబు పాల్గొన్నారు. విజయవాడ రోడ్డులోని బుచ్చమ్మ ఆశ్రమంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలోని పర్వతవర్ధనీ దేవి సంతాన లక్ష్మీగా, సోమేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజించారు. అంకమ్మతల్లి ఆలయంలో అమ్మవారు గాయత్రీ మాతగా దర్శనమిచ్చారు.

రాజరాజేశ్వరీమాతగా శ్యామలాంబ తల్లి

కైకలూరు: కైకలూరు శ్యామలాంబతల్లి ఆదివారం రాజరాజేశ్వరీమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానంలో చండీ మహాయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోలాట ప్రదర్శన, హరికథాగానం, కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రుల్లో అమ్మవారికి గులాబీ పుష్పార్చన, లలిత సహస్రనామ కుంకుమార్చన జరిగింది. ఐ భీమవరం గ్రామానికి చెందిన వెంకటసత్యనారాయణరాజు, సుబ్బలక్ష్మి దంపతులు పూజలు చేశారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గురజాడలో..

పమిడిముక్కల: గురజాడ శివాలయంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.



ఆటపాకలో లలితా త్రిపుర సుందరీ దేవీగా దుర్గమ్మ తల్లి

శ్రీ గజలక్ష్మీదేవిగా దర్శనం

గుడ్లవల్లేరు: మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే దసరా నవరాత్రులను పురస్కరించుకుని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు ఆదివారం గజలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మండవలిలో..

మండవల్లి: మండవల్లి, కానుకొల్లు, అయ్యవారిరుద్రవరం, లింగాల, భైరవపట్నంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పెరికెగూడెం దుర్గామాత ఆలయంలో అమ్మవారు ఆదివారం శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. గుంటూరుకు చెందిన సత్యనారాయణ దంపతులు పీటలమీద కూర్చుని పూజలు నిర్వహించారు. మండవల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. అర్చకులు నాగవెంకట శాస్త్రి భక్తులతో పూజలు జరిపించారు.



అపూర్వ సమ్మేళనం

పామర్రు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో 1991–92లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి తమ మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. సమ్మేళనంలో మహమ్మద్ షకీల్, నాగళ్ల కృష్ణమోహన్, యనమదల రామకృష్ణ, ఆరుమళ్ల రామకృష్ణారెడ్డి, కాట్రగడ్డ అనురాధ, బొమ్మారెడ్డి పావని తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గాయకుడిగా మురళీకృష్ణ

పామర్రు: వాసవీ జాగృతి, హెచ్‌ఐ 5 ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పామర్రు ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణకు ఉత్తమ గాయకుడుగా అవార్డును స్థానిక హితమ్ స్కూల్లో ఆదివారం అందజేశారు. వాసవీ జాగృతి అధ్యక్షుడు కొల్లిపర అనసూయ, హెచ్‌ఐ 5 ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్‌జీ నాగబాబు, కళాపీఠం కార్యదర్శి నందిపాటి హేమంత్‌రెడ్డి, యూటీఎఫ్ కార్యదర్శి లంక నరేంద్ర పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలు అభినందనీయం

కైకలూరు: పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ముందుకు వస్తున్న వైద్యులు అభినందనీయులని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు ఎన్జీవోస్ హోంలో స్థానిక ఓం నమోస్తుతే క్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లాస్య కంటి వైద్యురాలు డి.ప్రశాంతి, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ లక్ష్మీకాంతం, ఆశ్రం మెడికల్ కాలేజీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ జనరల్ సర్జన్ రాము, స్థానిక ఎముకల డాక్టర్ రవీంద్రబాబు వైద్య సేవలు అందించారు. మొత్తం 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



ఉచితంగా మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం –చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఉదయానికే ఆలయానికి చేరుకుకోవడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి పుట్టలోపాలు పోసేందుకు, పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసేందుకు అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ శ్రీదేవి, సిబ్బంది పర్యవేక్షించారు.

బాణసంచా స్వాధీనం

ముదినేపల్లి రూరల్: అక్రమంగా నిల్వ చేసిన బాణసంచాను స్థానిక పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక గురజ రోడ్డులో కె. శ్రీనివాసరావు అనే వ్యక్తి రూ.45 వేలు విలువైన బాణసంచాను ఒక గదిలో అక్రమంగా నిల్వ చేశాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ బి.వెంకటకుమార్ సిబ్బందితో దాడిచేసి నిల్వచేసిన బాణసంచాను స్వాధీనం చేసుకుని శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు



గుడివాడరూరల్: టిడ్కో గృహాల సముదాయం వద్ద చోరీలు, నేరాలు నియంత్రించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేసినట్లు గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని మల్లాయపాలెంలో ఉన్న టిడ్కో గృహాల సముదాయాన్ని పోలీస్ సిబ్బందితో కలసి ఆయన ఆదివారం పరిశీలించారు. తొలుత ఏయే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనే అంశాలపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

చెడుప్రవర్తన మార్చుకోవాలి

గుడివాడరూరల్: చెడు ప్రవర్తన కలిగిన వారు తమ తీరు మార్చుకుని నేరాలకు దూరంగా క్రమ శిక్షణతో జీవించాలని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో చెడు నడత కలిగి ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు.

పెరికెగూడెంలో గ్రామసభ

మండవల్లి: పెరికెగూడెంలో ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభ ఆదివారం నిర్వహించారు. సర్పంచ్ పెరుమాళ్ల పద్మ అధ్యక్షతన నిర్వహించిన సభలో పనుల నిర్వహణలో జరిగిన అంశాలపై చర్చించారు. ఎన్డీయే నాయకులు, సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలమ్మకు బంగారు రూపు సమర్పణ



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని నాట్యాచార్యుల ఇలవేల్పు శ్రీ బాలా త్రిపుర సుందరీ అమ్మవారికి కూచిపూడి నాట్యాచార్యులు పసుమర్తి సీతారామయ్య మనువడు పసుమర్తి శివఆదినారాయణ శర్మ బంగారు రూపును సమర్పించారు. ఆలయ పాలక మండలి సభ్యులకు పసుమర్తి నారాయణమూర్తి, జే నాగజగన్మోహనరావు, భాగవతుల సీతాపతికి ఆదివారం అందజేశారు.

గ్రామాల్లో వైద్యపరీక్షలు

గుడ్లవల్లేరు: పల్లె ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం వైద్య పరీక్షలను నిర్వహిస్తుందని ఉలవలపూడి సర్పంచ్ కన్య భాస్కరరావు అన్నారు. మండలంలోని ఉలవలపూడి, వేమవరం, వడ్లమన్నాడులో ఐసీఎంఆర్ ప్రత్యేక వైద్య బృందం వివిధ రుగ్మతలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు వైద్య పరీక్షలను చేపట్టింది. గ్రామ కార్యదర్శి డి.భాగ్యరాజ్ పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నకు ఘన నివాళులు



గుడివాడ టౌన్: వడ్డెర సామాజిక వర్గానికి సమాజంలో గుర్తింపు తెచ్చి వారి అభివృద్ధికి కృషి చేసిన నాయకుడు వడ్డె ఓబన్న అని ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం కృష్ణా జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్. శివనాగమల్లేశ్వరరావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం వ్యవస్థాపకులు వడ్డె ఓబన్న వర్ధంతి జరిపారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బి.నాగరాజు, రాములు, టి. నాగు, రాంబాబు, సుబ్రహ్మణ్యం, ఆర్.కొండ పాల్గొన్నారు.